సాక్షి ఆదిలాబాద్

శనివారం । 16 । నవంబర్ । 2024

నేడు ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాక

కైలాస్‌నగర్: రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ. ఫహీం శనివారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన అధికారిక పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఉదయం 8గంటలకు మహారాష్ట్రలోని యావత్మాల్ నుంచి బయలుదేరి 11గంటలకు ఆదిలా బాద్ జిల్లా కేంద్రానికి చేరుకోనున్నారు. పట్టణంలోని శాంతినగర్, మహాలక్ష్మివాడ, భుక్తాపూర్ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించనున్నారు. అనంతరం నిర్మల్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

గరిష్టం/కనిష్టం
31.0/15.0

వాతావరణం

వాతారణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతం పెరగనుంది. రాత్రివేళలో, వేకువ జామున చలి ప్రభావం కనిపించనుంది.



దీపం వెలిగిస్తున్న మహిళ

న్యూస్‌రీల్

కొనసాగుతున్న సమగ్ర సర్వే

- జిల్లాలో 86,952 ఇళ్లు పూర్తి

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సమగ్ర సర్వే జిల్లాలో కొనసాగుతుంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 86,952 ఇళ్ల సర్వేను ఎన్యుమరేటర్లు పూర్తి చేశారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో శుక్రవారం 3,056 ఇళ్లను సర్వే చేయగా, 17 మండలాల పరిధిలో 11,407 ఇళ్లను సర్వే చేసినట్లు అధికారులు వెల్లడించారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

- వర్చువల్‌గా మాట్లాడిన ప్రధాని మోదీ



పీఎం సందేశాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, పీవో ఖుష్బు గుప్తా, అధికారులు

ఉట్నూర్‌రూరల్: దేశంలో గిరిజనుల అభివృద్ధితోపాటు ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ సమావేశంలో పేర్కొన్నారు. బిర్సాముండా జయంతి సందర్భంగా ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో గిరిజన గౌరవ దినోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధాని మోదీ దేశంలోని 100 జిల్లాల గిరిజనులను ఉద్దేశించి మాట్లాడిన సందేశాన్ని వర్చువల్‌ద్వారా అధికారులు, గిరిజనులు తిలకించారు. కార్యక్రమానికి ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు, రాయిసెంటర్ జిల్లా అధ్యక్షుడు మెస్రం దుర్గు, ఇతర అధికారులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని వీక్షించారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే 'ధర్తి అభ జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్' పథ కం ప్రధాన ఉద్దేశమన్నారు. దేశవ్యాప్తంగా ఈ పథకం కింద ఆయా జిల్లాల్లో మొదటి దశలో ఎంపికైన 31 ఆవాసాలను అభివృద్ధి పర్చే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గిరిజనులకు చెక్కులు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇందులో ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఐటీడీఏ ఏపీవో వసంత్‌రావు, పీవీటీజీ ఏపీవో మనోహర్, ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు బిర్సా ముండా



బిర్సాముండా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: సమాజం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు బిర్సాముండా అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మావల మండలంలోని కుమురం భీం కాలనీలో శుక్రవారం నిర్వహించిన బిర్సాముండా జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, పోరాట యోధుల స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..

హీరా సుక్కా ఆదివాసీ జాగృతి సమితి ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ముండా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు సిడాం రాంకిషన్, నాయకులు శంకర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



దీపకాంతుల వెలుగులో ఆలయ ప్రాంగణం



మఠంలో కాకడ హారతిలో పాల్గొన్న మహిళలు



కాకడ హారతిలో ఎమ్మెల్యే శంకర్ దంపతులు

'కార్తిక' వెలుగులు

కార్తిక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆలయాలు శుక్రవారం భక్తులతో పోటెత్తాయి. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో దీపోత్సవం నిర్వహించారు. వేకువజామున కాకడ హారతి చేపట్టారు. మహిళలు, యువతులు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. తమ కుటుంబాలను చల్లంగ చూడాలని వేడుకున్నారు. ఆలయ ఆవరణ దేదీప్యమానంగా వెలుగొందింది.

- ఆదిలాబాద్

సామూహిక వ్రతాలు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. 443 జంటలు పాల్గొన్నాయి. ఎండోమెంట్ కార్యనిర్వాహణాధికారి వామన్‌రావు అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

పట్టు పట్టి.. కొలువు కొట్టి

- ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి.. విజయతీరాలకు చేరువై
- గ్రూప్‌-4 ఫలితాల్లో జిల్లావాసుల ప్రతిభ

సర్కారు కొలువే లక్ష్యంగా వారంతా శ్రమించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆత్మస్థైర్యం వీడలేదు. ఓటములు చవిచూసినా పట్టు సడలనివ్వలేదు. నిరాశకే నిరాశ పుట్టేలా ఒక్కో అడుగుతో ముందుకు సాగారు. ఓ వైపు బాధ్యతలు, మరోవైపు విధులు నిర్వర్తిస్తూనే పుస్తకాలతో కుస్తీ పట్టారు. ప్రణాళికాబద్ధంగా చదివి గ్రూప్‌-4 ఫలితాల్లో మెరిశారు. ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికయ్యారు. గెలుపుతీరాన నిలిచిన జిల్లాకు చెందిన పలువురి విజయగాథలు.

- ఆదిలాబాద్



మూడో కొలువుకొట్టిన.. అమీర్



జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన షేక్ అమీర్ 2019లో జేపీఎస్ కొలువు సాధించాడు. అయినా సంతృప్తి పడలేదు. పుస్తకాలను వీడకపోవడంతో 2020లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. అనంతరం గ్రూప్‌-4లోనూ సత్తా చాటాడు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో జిల్లాస్థాయిలో 47వ ర్యాంకు సాధించాడు. తాజాగా జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా సారంగాపూర్ పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు అమీర్. తల్లిదండ్రులు షేక్ షఫీ–రషీదా బేగంల కష్టం, అన్నదమ్ముల మార్గదర్శకత్వంతోనే ఉద్యోగాలు సాధిస్తున్నట్లు చెబుతున్నాడు. తన తదుపరి లక్ష్యం గ్రూప్‌-2 ఉద్యోగమని అంటున్నాడు. ముఖ్యంగా నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల తనను ఎంతగానో ప్రోత్సహించారని, ఆమెకు ఎప్పటికీ కృతజ్ఞుడిగా ఉంటానని పేర్కొంటున్నాడు.

సొంతంగా ప్రిపేర్ అయిన 'శీతల్'



పట్టణానికి చెందిన రామగిరి శీతల్ ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేశారు. భర్త ఆర్మీ ఉద్యోగి. ఓ వైపు ఇంటి బాధ్యతలు చక్కబెడుతూనే, ఎలాగైనా ఉద్యోగం సాధించాలని ప్రిపరేషన్ కొనసాగించారు. ఎలాంటి కోచింగ్ లేకుండా ఇంటి వద్ద స్వయంగా సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో గురుకుల టీజీటీ ఫలితాల్లో 1:3 వరకు వెళ్లినా ఉద్యోగం దక్కలేదు. ఇటీవల డీఎస్సీ ఎస్‌ఏ(బయోసైన్స్) ఫలితాల్లోనూ నిరాశే మిగిలింది. 18వ ర్యాంకు వచ్చినా జాబ్ త్రుటిలో చేజారింది. అయితే తాజాగా ప్రకటించిన గ్రూప్‌- 4 ఫలితాల్లో మాత్రం జిల్లాస్థాయిలో 24వ ర్యాంకుతో ప్రతిభ కనబరిచారు. బాలికల విద్యాసంస్థలో జూనియర్ అసిస్టెంట్ కొలువు సాధించారు.

ఉద్యోగాల బాటలో.. సంతోష్



తలమడుగు మండలం ఖోడద్ గ్రామానికి చెందిన మెట్‌పల్లి రాజు–మంజుల దంపతుల కుమారుడు సంతోష్‌కుమార్ గ్రూప్‌- 4 ఫలితాల్లో మెరిశాడు. ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తిచేసిన సంతోష్ 2020 నుంచి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడమే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. ఇటీవల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మెరిట్ లిస్టులో జోన్‌-2లో నాలుగో ర్యాంకు సాధించాడు. ఈ కొలువు సైతం దాదాపుగా దక్కినట్లే. అలాగే ఇటీవల గ్రూపు-1 మెయిన్స్ పరీక్షలకు సైతం హాజరయ్యాడు. తనకు అఖిల్ బుద్ధి స్ఫూర్తి అని, తన తదుపరి లక్ష్యం ఐఏఎస్ అని అంటున్నాడు సంతోష్‌కుమార్.

తోబుట్టువుల స్ఫూర్తితో 'బాలాజీ'



ప్రభుత్వ ఉద్యోగాలను వరుసగా సాధిస్తూ సత్తా చాటుతున్నాడు జిల్లాలోని నార్నూర్ మండలం శీతల్ గూడ గ్రామానికి చెందిన పాపాజీ–శకుంతలబాయి దంపతుల కుమారుడు గైకాంబ్లే బాలాజీ. ఒకటి కాదు.. రెండు కాదు.. ఇప్పటివరకు ఏకంగా మూడు ఉద్యోగాలు సాధించాడు. ఎంఏ, బీఈడీ పూర్తి చేసిన ఈయన వరుస ఉద్యోగ నోటిఫికేషన్లలో ప్రతిభ కనబరుస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. గతేడాది పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికైన బాలాజీ ప్రస్తుతం జడ్చర్లలో శిక్షణలో ఉన్నాడు. ఇటీవలే గురుకుల టీజీటీ(సోషల్ స్టడీస్)గా ఎంపికైనా ఆ ఉద్యోగాన్ని వదులుకున్నాడు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌-2024 ఫలితాల్లో జోన్‌-2లో ప్రతిభ కనబరిచి ఉద్యోగరేస్‌లో నిలిచాడు. తాజాగా గ్రూప్‌-4 ఫలితాల్లోనూ సత్తా చాటి వార్డు ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. నాన్న శ్రమ, తోబుట్టువుల స్ఫూర్తితో తాను ప్రభుత్వ ఉద్యోగాలను సాధిస్తున్నట్లు బాలాజీ చెబుతున్నాడు. గ్రూప్‌-2 ఆఫీసర్ కావడమే తన లక్ష్యమని అంటున్నాడు.

పట్టువదలని 'నాగేంద్ర'



జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన ఎన్నావార్ నర్సింలు–జయలక్ష్మిల కుమారుడు నాగేంద్ర. ఎమ్మెస్సీ పూర్తి అయిన తర్వాత ప్రిపరేషన్ బాట పట్టాడు. జూనియర్ పంచాయతీ కార్యదర్శి, ఆర్‌ఆర్‌బీ గ్రూప్‌-డి ఉద్యోగావకాశాలను త్రుటిలో చేజార్చుకున్నాడు. అయినా నిరాశ చెందకుండా స్నేహితుల ప్రోత్సాహంతో ముందుకు సాగాడు. పట్టు వదలని విక్రమార్కుడిలా శ్రమించాడు. ఎట్టకేలకు గ్రూప్‌-4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని కైవసం చేసుకున్నాడు.

'మహా' ప్రచారంలో మనోళ్లు



నాసిక్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రచారం..



చంద్రాపూర్ ఎన్నికల ప్రచారంలో ఎంపీ నగేశ్

- బీజేపీ నుంచి ఎంపీ, ఎమ్మెల్యే
- మంత్రి సీతక్కతో కలిసి జిల్లా కాంగ్రెస్ నేతలు

సాక్షి,ఆదిలాబాద్: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండగా, జిల్లా నేతలు అక్కడి వివిధ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ జనాన్ని కలుస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఉత్తర మహారాష్ట్రలో పర్యవేక్షణ బాధ్యతలను ఏఐసీసీ అప్పగించడంతో ఆమె అక్కడే ఉండి ప్రచారం చేస్తున్నారు. బీజేపీ పరంగా ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఇప్పటికే పలుమార్లు అక్కడికి వెళ్లి వారు ప్రచారం చేస్తున్నారు. ఈనెల 20న మహారాష్ట్రలో పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో ఆ ఎన్నికలను సరిహద్దున ఉన్న జిల్లావాసులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

సీతక్కతో కలిసి..

జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఏఐసీసీ ఉత్తర మహారాష్ట్ర ఎన్నికల పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆమె కొద్ది రోజులుగా అక్కడే ఉండి ప్రచారం చేస్తున్నారు. జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత ఆత్రం సుగుణ మంత్రితో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు. నాసిక్, ముంబాయ్, చంద్రాపూర్, యవత్మాల్ తదితర ప్రాంతాల్లో సీతక్కతో కలిసి జిల్లాకు చెందిన పలువురు నేతలు ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ప్రధానంగా ఆదివాసీలు అధికంగా ఉన్నచోట సీతక్క ఫోకస్ పెంచారు. అంతేకాకుండా మహారాష్ట్రలో సీఎం రేవంత్ రెడ్డి టీమ్ విస్తృతంగా పర్యటిస్తుండగా, ఆ టీమ్‌తో కలిసి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నేతలు కూడా సరిహద్దు ప్రాంతాల్లోని నియోజకవర్గాల్లో ప్రచా రంలో పాల్గొంటున్నారు. ఒకట్రెండు రోజుల్లో రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర పర్యటనకు వస్తుండడంతో జిల్లాకు చెందిన నేతలు అనేక మంది ఆ ప్రచారంలో పాల్గొనేందుకు బయల్దేరి వెళ్లనున్నారు.

బీజేపీ నేతలకు ఇన్‌చార్జి బాధ్యతలు..

ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌కు చంద్రాపూర్ ఇన్‌చార్జి బాధ్యతలను పార్టీ అప్పగించింది. దీంతో ఆయన ఆ ప్రాంతంలో పార్టీ అభ్యర్థులతో కలిసి ఇప్పటికే విస్తృతంగా ప్రచారంలో పాల్గొన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు వార్ధా నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన ఇప్పటికే ఆ నియోజకవర్గంలో పర్యటించారు. అంతేకాకుండా రాష్ట్రానికి చెందిన పార్టీ ముఖ్య నేతలు మహారాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు వారితో కలిసి ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొంటున్నారు. ఇటీవల నాగ్‌పూర్‌లో జరిగిన ప్రచార కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ రాగా, ఎమ్మెల్యే శంకర్ అక్కడ పర్యటించారు. హింగన్‌ఘాట్‌లో బీజేపీ ముఖ్య నేత బీఎల్ సంతోష్‌తో కలిసి జిల్లా నేతలు పలువురు ప్రచారంలో పాల్గొన్నారు. కిన్వట్ బహిరంగ సభలో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేందర్ పడ్నవీస్‌తో కలిసి బహిరంగ సభలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.



వార్ధా ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్



బంగారుగూడ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో క్వారీలో పడ్డ ఆటో

ఆదిలాబాద్ పట్టణం బంగారుగూడకు చెందిన సవితతో పాటు మరో ముగ్గురు మహిళలు చేనులో కూలి పనులు చేసేందుకు ఆటోలో గురువారం కచ్‌కంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బంగారుగూడలోని డంపింగ్ యార్డు వద్ద వాహనం ప్రమాదవశాత్తు బోల్తా పడింది. డ్రైవర్‌తో కలిపి ఐదుగురు క్వారీలో పడ్డారు. స్థానికులు గమనించి ధోతిని వేసి నలుగురి ప్రాణాలు కాపాడారు. కాగా సవిత మృత్యువాత పడింది. ఈ ఘటనతో ఆమె ఇద్దరు పిల్లలు తల్లిని కోల్పోయారు. పొట్టకూటి కోసం వెళ్లి మరణించడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయింది.

నాలుగేళ్ల క్రితం తలమడుగు మండలం దేవాపూర్ సమీపంలో తవ్విన క్వారీలో పడి ఇద్దరు విద్యార్థులు మరణించారు. దసరా సెలవుల్లో సరదాగా అటువైపు వెళ్లి వారు స్నానం చేద్దామని అందులోకి దిగగా, ఈత రాక మృతిచెందారు. పెద్ద ఎత్తున క్వారీ తవ్వడమే దీనికి కారణమని తెలుస్తోంది.

బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి సమీపంలోని కాంక్రీట్ క్వారీలో పనిచేస్తున్న ఓ యువతి బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు క్వారీలో పడి మృతిచెందింది. అదేవిధంగా వర్తమన్నూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు గణేశ్ నిమజ్జనం కోసం వెళ్లి ప్రమాదవశాత్తు క్వారీలో పడి మరణించాడు. అలాగే పలు మండలాల్లో అక్రమంగా తవ్విన మొరం క్వారీల్లో పశువులు నీటి కోసం వెళ్లి మరణించిన ఘటనలు సైతం అనేకంగా ఉన్నాయి.



తలమడుగు గ్రామ సమీపంలోని క్వారీ



మావల గ్రామ సమీపంలోని క్వారీ

ప్రాణాలు తీస్తున్న క్వారీలు

- నిబంధనలకు విరుద్ధంగా మొరం తవ్వకాలు
- గుంతల్లో పడి ఇప్పటికే పలువురు మృత్యువాత
- 'మామూలు'గా వ్యవహరిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో మొరం అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో వెలిసిన క్వారీల కారణంగా ప్రజలు, మూగజీవాల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతి లేకుండా మొరం తవ్వకాలు చేపడుతూ కొందరు అక్రమార్కులు రూ.లక్షల్లో దండుకుంటున్నారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్, అటవీ ప్రాంతాల్లో మొరం, కాంక్రీట్ కోసం తవ్విన చోట ఏర్పడిన గుంతల చుట్టూ కాంట్రాక్టర్లు కనీసం కంచెలు కూడా ఏర్పాటు చేయడం లేదు. దీంతో అటువైపుగా వెళ్లే ప్రజలు, మూగజీవాలు అందులో పడి తనువు చాలిస్తున్న ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి.

గాలిలో కలుస్తున్న ప్రాణాలు..

అధికారుల అలసత్వం, వ్యాపారుల నిర్లక్ష్యంతో అమాయకులు బలవుతున్నారు. అక్రమ తవ్వకాలను అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో ఈ తతంగం సాగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంత మంది మైనింగ్, రెవెన్యూ అధికారులు వారి నుంచి నెలనెలా మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఒక్కో టిప్పర్‌కు గాను రూ.2వేలకు పైగా వసూలు చేస్తున్నట్లు సమాచారం.

యథేచ్ఛగా తవ్వకాలు..

జిల్లాలోని ఆదిలాబాద్‌రూరల్, తలమడుగు, తాంసి, నేరడిగొండ, బోథ్, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, బేల, మావల తదితర మండలాల్లో అక్రమంగా క్వారీ తవ్వకాలు సాగుతున్నాయి. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని యాపల్‌గూడ, బంగారిగూడ, కొత్తగూడెం, పిప్పల్‌ధరి, అంకోలి, తలమడుగు మండలంలోని కజ్జర్ల, దేవాపూర్, మావల, తాంసి మండలంలోని బండల్‌నాగాపూర్, సావర్గాం, బేల మండలంలోని సోన్‌కాస్, సైద్‌పూర్, పలాయితాండ, నేరడిగొండ మండలంలోని కుప్టి, కొర్టికల్, బందంరేగడి, వడూర్, తర్నం, బోథ్, గుడిహత్నూర్ మండలాల్లోని ఆయా గ్రామాల శివారులోనూ మొరం తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నా యి. అక్రమ తవ్వకాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అరికట్టాల్సిన అధికా రులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై జిల్లా మైనింగ్ శాఖ ఏడీ రవీందర్‌ను పలుమార్లు ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు. ఈ అక్రమాలకు సంబంధించి పలువురు కార్యాలయంలోకి వెళ్లి ఫిర్యాదు చేసేందుకు యత్నించినా అందుబాటులో ఉండకపోవడం గమనార్హం.

సాక్షి ఫోకస్

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం..

అక్రమ మైనింగ్ వ్యవహారంలో చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మైనింగ్ శాఖపై ఉంటుంది. నిబంధనల ప్రకారం క్వారీలకు అనుమతులు ఇవ్వడంతో పాటు ఆ మేరకు తవ్వకాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత ఆ శాఖపైనే ఉంటుంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నట్లుగా ఇటీవలే మా దృష్టికి వచ్చింది. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకునేలా చూస్తాం.

– టి.వినోద్ కుమార్, ఆర్డీవో, ఆదిలాబాద్

క్లుప్తంగా

'28న స్ట్రక్చరల్ సమావేశం'



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల ప్రధాన డిమాండ్లపై చర్చించడానికి ఈ నెల 28న డైరెక్టర్ (పా) లెవల్ స్ట్రక్చరల్ సమావేశం జరుగనున్నట్లు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య తెలిపారు. శుక్రవారం నస్పూర్ –శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్ట్రక్చరల్ సమావేశాలు జరుగక 8 ఏళ్లు అవుతుందని, సమావేశంలో కార్మికుల పెండింగ్ డిమాండ్లపై చర్చిస్తామన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరబద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచీ కార్యదర్శి షేక్ బాజీసైదా, నాయకులు కొమురయ్య, నర్సింగరావు, అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

17న చెస్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ 9, 13 బాల, బాలికల చదరంగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నన్నపు స్వామి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన గల చాణక్య ఇంటర్నేషనల్ పాఠశాలలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. అండర్ 9 విభాగంలో జనవరి 1, 2015 తర్వాత జన్మించిన బాలబాలికలు, అండర్ 13 విభాగంలో జనవరి 1, 2011 తర్వాత జన్మించినవారు అర్హులని తెలిపారు. అర్హత గల ఉమ్మడి జిల్లాలోని బాల, బాలికలు ఈనెల 16వ తేదీన సాయంత్రం 5 గంటలలోగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే వారు తమ సొంత చెస్ బోర్డ్‌తో పాటు వయసు ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు 93983 93293, 62819 66588 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బండరాళ్ల కోసం వెళ్లి.. అనంత లోకాలకు



సల్లోళ్ల నర్సింలు (ఫైల్)

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన సల్లోళ్ల నర్సింలు(24) బండరాళ్ల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై భాస్కరాచారి కథనం ప్రకారం.. మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన లక్ష్మణ్, ర్యాపని నర్సింలు, తిమ్మన్నలు కలిసి గురువారం గ్రామ శివారు గుట్ట ప్రాంతానికి బండరాళ్లను తీసుకురావడానికి ట్రాక్టర్ తీసుకొని వెళ్లారు. మధ్యాహ్నం ట్రాక్టర్‌లో బండరాళ్లు నింపే క్రమంలో నర్సింలు ప్రమాదవశాత్తు కాలుజారి వెనక్కి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఏడాది కుమారుడు ఉన్నారు. భార్య అల్లకుంట గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైళ్ల పునరుద్ధరణ

- యథాతథంగా రైలు ప్రయాణం
- ప్రయాణికులకు ఊరట



మంచిర్యాల రైల్వేస్టేషన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రైలు పట్టాల పనులు పూర్తి చేసి రైళ్లను పునరుద్ధరించడంతో ప్రయాణికులకు ఊరట లభించింది. రామగుండం, రాఘవాపురం మధ్య గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో గత మూడు రోజులుగా రైలు ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తిన విషయం తెలిసిందే. జిల్లా గుండా వెళ్లే బల్లర్షా, కాజీపేట, వరంగల్ వెళ్లే రైళ్లు రద్దు చేయడంతోపాటు మరికొన్నింటిని దారి మళ్లించారు. దీంతో ప్రయాణానికి అవరోధం ఏర్పడింది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది వేగంగా ట్రాక్ పునరుద్ధరణ పనులు పూర్తి చేశారు. రెండు రోజులపాటు రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన ట్రాక్ పనులు పూర్తి చేశారు. దీంతో బుధవారం రాత్రి వరకు దెబ్బతిన్న చోట మూడు ట్రాక్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఈ క్రమంలో యథావిధిగా ప్రయాణం తిరిగి మొదలైంది. ప్యాసింజర్ రైళ్లతోపాటు గూడ్స్ రైళ్లు నడిపిస్తున్నారు. మొదట కొంత ఆలస్యంగా నడిచినప్పటికీ శుక్రవారం వరకు అన్ని రైళ్లు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రోజువారీగా ప్రయాణం సాగించే ఉద్యోగులు, వ్యాపారులకు ఊరట కలిగింది.

తెలియని కారణం?

ప్రమాదం జరిగిన తీరుపై ఇప్పటికీ స్పష్టమైన కారణం తెలియకపోవడంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. గూడ్స్ రైలు ప్రమాదం ఎందుకు జరిగిందనేది ఇప్పటికీ ఇంజనీరింగ్ అధికారులకు సహేతుక కారణం దొరకలేదు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ప్రాథమిక నివేదికలోనూ ఇదే పంపించే అవకాశం ఉంది. ప్రమాద ఘటనపై బాధ్యులను గుర్తించి ఆ మేరకు శాఖ పరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీనిపై సెఫ్టీ కమిటీ నిర్ధారించాల్సి ఉంది. మరోవైపు రైల్వేలో సిబ్బందికి పని ఒత్తిడి, ట్రాక్ పనుల బాధ్యత అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పర్యవేక్షణ, ఓవర్ లోడ్ తదితర కారణాలు ప్రమాదానికి కారణంగా అనుమానిస్తున్నారు. ప్యాసింజర్ ట్రైన్‌కు కాకుండా గూడ్స్ రైలుకు జరగడంతో పెను ముప్పు తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. భవిష్యత్‌లో మరోమారు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

పడవ ప్రయాణం.. ప్రమాదకరం!



తాంసి: పెన్‌గంగ నదిపై వారధి లేక రాకపోకలకు నాటుపడవలను ఆశ్రయిస్తూ భీంపూర్ మండలవాసులు ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. భీంపూర్ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పెన్‌గంగ నదికి ఆవలి వైపున ఉన్న మహారాష్ట్రకు నిత్యం ప్రయాణాలు చేస్తుంటారు. నదిని దాటడానికి వంతెన లేకపోవడంతో నాటుపడవల్లో వెళ్తుంటారు. శుక్రవారం వడూర్ గ్రామశివారులో నాటుపడవలో ద్విచక్ర వాహనాన్ని ఎక్కించి నదిని ప్రమాదకరంగా దాటుతుండగా 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

- కాలి బూడిదైన 25 క్వింటాళ్ల పత్తి
- రూ.5 లక్షల వరకు నష్టం



పూర్తిగా దగ్ధమైన ఇల్లు

వాంకిడి: అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోయిన సంఘటన మండలంలోని ఇందాని గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందాని గ్రామానికి చెందిన చాప్లె ప్రకాశ్ అతని భార్యతో కలిసి శుక్రవారం ఉదయం పొలంలో పత్తి ఏరడానికి వెళ్లాడు. వారి 5 సంవత్సరాల కూతురు, 2 సంవత్సరాల కుమారుడిని పక్కనే ఉంటున్న నాన్నమ్మ ఇంట్లో వదిలి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేరు. ఈక్రమంలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంట్లో అకస్మాత్తుగా పొగలు కమ్ముకోవడంతో చుట్టుపక్కల వారు గమనించి నిప్పులు ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ గత వారం రోజులుగా ఏరిన పత్తి ఇంట్లోనే నిల్వ ఉండటం.. ఫైరింజన్ రావడంలో ఆలస్యం జరగడంతో మంటలు తీవ్రంగా చెలరేగాయి. దీంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. రెండు మేక పిల్లలను ఇంట్లోనే కట్టేసి వెళ్లగా మంటలు చెలరేగే సమయంలో స్థానికులు బయటకు తీశారు. ఇంట్లో అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన 25 క్వింటాళ్ల పత్తి, రూ.లక్ష నగదు, ఒకటిన్నర తులాల బంగారం, 12 తులాల వెండి, రెండు బెడ్లు, తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయని దంపతులు వాపోయారు. సుమారు రూ.5 లక్షల కంటే ఎక్కువ నష్టం వాటిల్లిందని కన్నీటి పర్యంతమయ్యారు. కాగా విద్యుత్ షాక్ సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'డయల్ యువర్ ఆర్ఎం'కు స్పందన

ఆదిలాబాద్: ఆర్టీసీ రీజియన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమానికి స్పందన లభించింది. రీజినల్ మేనేజర్ సోలోమన్ ప్రయాణికుల నుంచి ఫోన్ ద్వారా వచ్చిన విజ్ఞప్తులు, ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడపాలని, ఆసిఫాబాద్ రూట్‌లో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు వేయాలని, ఉట్నూర్ నుంచి ఖానాపూర్‌కు వయా కడెం మీదుగా మరిన్ని సర్వీసులు నడపాలని, సాయంత్రం వేళలో ఆదిలాబాద్ నుంచి కరీంనగర్‌కు ప్రత్యేక సర్వీస్‌లు వేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఆర్ఎం అన్ని విషయాలను పరిగణలోనికి తీసుకొని ప్రయాణికుల సమస్యలు, విజ్ఞప్తులు, ఫిర్యాదులను పరిష్కరిస్తామని వెల్లడించారు.

కొత్తపల్లికి ఆర్టీసీ బస్సు నడపాలని వినతి

భీమారం: మండల కేంద్రం నుంచి కొత్తపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడిపించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు అనుమోల్ల అశోక్, చిలకాని కనకయ్య, బోయిరి లక్ష్మణ్ శుక్రవారం మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఆరెపల్లి, మద్దికల్, ఎలకేశ్వరం, తాళ్లగూడెం గ్రామాల మీదుగా కొత్తపల్లి వరకు బస్సు నడిపిస్తే మండల ప్రజలకు ప్రజారవాణా అందుబాటులోకి వస్తుందని వివరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కారు ఢీకొట్టి యువకుడు..



అరుణ్ (ఫైల్)

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బొమ్మిడి అరుణ్‌కుమార్(26) అనే యువకుడు కారు ఢీకొని మృతిచెందినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. అరుణ్‌కుమార్ తన స్నేహితులు దినకర్, విష్ణు, మహేశ్‌లతో కలిసి రోజూ మాదిరి శుక్రవారం మార్నింగ్ వాక్‌కు వెళ్లాడు. కొత్తూరు గ్రామ స్టేజీ సమీపంలో జన్నారం నుంచి లక్సెట్టిపేటకు వెళ్తున్న కారు యువకుడిని వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో కాలు విరిగి తలకు బలమైన గాయమై అరుణ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా, మహేశ్‌కు గాయాలయ్యాయి. అరుణ్‌కుమార్ తండ్రి చిన్నతనంలోనే మృతి చెందగా, తమ్ముడు తరుణ్ హైదరాబాద్‌లో పీజీ చదువుతున్నాడు. మృతుడి తల్లి మంజులత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు..

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న మంచిర్యాల లైన్స్‌క్లబ్ సభ్యులు అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో మాట్లాడి నేత్రదానం చేయడానికి ఒప్పించారు. వైద్యాధికారి అభిషేక్ సహకారంతో నేత్రాలలోని కార్నియాను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు పంపించినట్లు లైన్స్‌క్లబ్ నిర్వాహకుడు మధుసూదన్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడి హైవేపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతిచెందగా భార్యకు గాయాలయ్యాయి. పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మండలం ఎర్రగుంటపల్లెకు చెందిన కోట సాంబశివరావు(66), శివపార్వతి దంపతులు ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వెళ్తుండగా గద్దెరాగిడి వైన్స్ షాపు వద్ద ఓ అంబులెన్స్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో సాంబశివరావు మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులు ప్రతికూల పరిస్థితులను అధిగమించాలి

భైంసా: విద్యార్థులు ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ డా. మురళీదర్శన్ అన్నారు. శుక్రవారం బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రతికూల పరిస్థితులను ఎలా అధిగమించాలో అనే అంశంపై కాన్ఫరెన్స్‌హాల్‌లో పీయూసీ విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును రూపొందించే సామర్థ్యాన్ని కలిగి ఉండాలన్నారు. చిన్న విషయాలకే ధైర్యాన్ని కోల్పోకూడదని తెలిపారు. ఈ దశ నుంచే స్ఫూర్తిదాయకమైన నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, ధైర్యం, పట్టుదల తదితర అంశాలను అలవర్చుకోవాలన్నారు. అనునిత్యం కొత్త ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, పలువురు డీన్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు.. పలువురికి గాయాలు

బైక్ అదుపుతప్పడంతో..



గాయపడిన తిరుమన్‌రావు

తిర్యాణి: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మొర్రిగూడ పంచాయతీ పరిధిలోని లచ్చుగూడ గ్రామానికి చెందిన కోర్వెత తిరుమన్‌రావు బైక్‌పై తిర్యాణి నుంచి మొర్రిగూడ వైపునకు వెళ్తుండగా పాత సమ్మక్క గద్దల వద్ద బైక్ అదుపుతప్పి కిందపడటంతో ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముధోల్‌లో..

ముధోల్: మండల కేంద్రంలో శుక్రవారం బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బ్రహ్మన్‌గావ్ గ్రామానికి చెందిన భూమన్న అనే వ్యక్తి ముధోల్ వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలో ఐసీడీఎస్ కార్యాలయం సమీపంలో ఒక్కసారిగా అదుపుతప్పి కిందపడిపోయాడు. ప్రమాదంలో భూమన్నకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా, అంబులెన్సు టెక్నీషియన్ మాధవ్, పైలట్ గౌతమ్‌లు సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం భైంసా ఏరియాసుపత్రికి తరలించారు.


ఆటో ఢీ కొట్టడంతో ఒకరికి..

ముధోల్: మండలంలోని బాసర –భైంసా ప్రధాన రహదారిపై చార్‌బాయి బీడీ కంపెనీ సమీపంలో ఆటో ఢీకొన్న సంఘటనలో మహిళకు తీవ్ర గాయాలైనట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. బాసర మండల కేంద్రానికి చెందిన లక్ష్మి గురువారం రాత్రి నడుచుకుంటూ బాసర వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలై కాలు విరిగిపోయింది. గమనించిన స్థానికులు పోలీసులకు, 108కు సమాచారం అందించారు. వెంటనే అంబులెన్స్‌లో లక్ష్మిని భైంసా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించినట్లు బాధితురాలి భర్త ముత్తన్న తెలిపారు. ముత్తన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన ర్యాపన సాయినాథ్(25) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ నైలు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ర్యాపన సాయినాథ్ గత కొన్ని రోజులుగా కంటి నొప్పితో బాధపడుతున్నాడు. గురువారం ఉదయం కంటి చికిత్స కోసం ముధోల్ కంటి ఆసుపత్రికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలే దు. కుటుంబసభ్యులు ఆయన కోసం ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం శివారులో చెట్టుకు ఉరేసుకుని కన్పించాడు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించా రు.

మద్యం అనుకొని గడ్డిమందు తాగి వ్యక్తి మృతి



ఇజ్రాయిలు మృతదేహం

ముధోల్: మద్యం మత్తులో ఉన్న వ్యక్తి ఇంట్లో ఉన్న గడ్డి మందును మద్యం అనుకొని తాగి మృతి చెందిన సంఘటన మండలంలోని కారేగాంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇజ్రాయిలు (42) తన భార్య మరియమ్మతో కలిసి భవన కూలీగా జీవిస్తూ ముధోల్ మండలం కారేగాంలోని అద్దె ఇంట్లో ఉంటున్నాడు. గురువారం మద్యం తాగి ఇంటికి వచ్చిన ఇజ్రాయిలు మద్యం మత్తులో అద్దె ఇంట్లో ఉన్న గడ్డిమందును మద్యం అనుకొని తాగి విషయాన్ని భార్యకు చెప్పాడు. అనుమానం వచ్చిన భార్య మరియమ్మ గడ్డిమందు సీసాను ఇంటి యజమానికి చూపించగా గడ్డిమందు అని ఆయన తెలపడంతో వెంటనే ఇజ్రాయిలును భైంసా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లేశ్ పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు గేదెలు బలి

మందమర్రిరూరల్: మండలంలోని దుబ్బపల్లి సమీపంలో విద్యుత్ తీగలు అమర్చిన వేటగాళ్ల ఉచ్చుకు తగిలి గేదెలు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మందమర్రిలోని షిర్కే నివాసి ఇందూరి శంకర్ కు చెందిన రెండు గేదెలు బుధవారం ఉదయం మేత కోసం వెళ్లాయి. గేదెలు ఇంటికి తిరిగి రాకపోవడంతో రెండురోజులుగా వాటి కోసం గాలించాడు. ఈక్రమంలో శుక్రవారం దుబ్బపల్లి సమీపంలో గేదెలు విద్యుత్ తీగల కు తగిలి మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ సుమారు. రూ.2లక్షల వరకు ఉంటుందని బాధితుడు శంకర్ తెలిపారు. వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చిన ప్రాంతంలో గేదెలతో పాటు మరికొన్ని జీవాలు కూడా మృతి చెందిన ఆనవాళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఎఫ్‌బీవో రాజేశ్వరిని వివరణ కోరగా తనకు సమాచారం లేదన్నారు.

సర్వేలో 'వలస' ప్రశ్నలు



సమగ్ర సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు

- ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి సమాచారం సేకరణ
- సంక్షేమం కోసమే అంటున్న గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు
- పూర్తి సమాచారం ఇవ్వాలని సూచన



సర్వేలో వలస వెళ్లిన వారి వివరాలకు సంబంధించిన ప్రశ్నల విభాగం

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో సామాజిక, ఆర్థిక, కుల గణన కోసం ఇంటింటి సమగ్రసర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. ఇందులో దాదాపు 56 కాలమ్స్‌లలో ప్రధాన ప్రశ్నలు ఉండగా, అందులోని ఉపప్రశ్నలతో కలిపి మొత్తం 75 వరకు ప్రశ్నావళితో కుటుంబం సమగ్ర వివరాలను సేకరించి పొందుపరుస్తున్నారు. ఈ మేరకు నిర్మల్ జిల్లాలోనూ ఎన్యూమరేటర్లు సమాచారాన్ని సేకరించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల నుంచి ఉపాధి కోసం గల్ఫ్ దేశాల బాట పడుతున్న కార్మికుల సంఖ్య గణనీయంగా ఉంది. గల్ఫ్ కుటుంబాల సమస్యలను సర్వే ద్వారా తెలుసుకునేందుకు ప్రశ్నావళిలోని 48, 48(బి), 48(డి) ప్రశ్నల ద్వారా ఏ దేశానికి వలస వెళ్లారు...? వెళితే ఆ దేశం పేరు...? వలస వెళ్లడానికి ప్రధానమైన కారణం..? వంటి ప్రశ్నలకు ఆయా కుటుంబాల నుంచి సమాచారం సేకరిస్తున్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం..

సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ కుల గణన కోసం చేపడుతున్న ఇంటింటి సర్వేలో గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాలు సమాచారాన్ని ఇవ్వడం ద్వారా రానున్న రోజుల్లో వారి సంక్షేమ కోసం ప్రణాళికలు అమలుపరిచే అవకాశం ఉందని గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఉన్న ఊరిలో సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పాటు, స్వీయ వ్యవసాయ భూకమతాలు లేకపోవడం కారణాలుగా గల్ఫ్ దేశాలను వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నట్లు చెబుతున్నారు. సమగ్ర సర్వే ద్వారా పూర్తి సమాచారం నివేదిక రూపంలో అందుబాటులోకి వస్తే, తద్వారా గల్ఫ్ కార్మికుల సంఖ్య స్పష్టమవుతుంది.

రాష్ట్రాలు, దేశాలకు వేర్వేరుగా..

జిల్లాలోని పేద, మధ్య తరగతికి చెందిన చాలామంది తమ స్వస్థలాల నుంచి వివిధ కారణాల రీత్యా ఉపాధి ఉద్యోగ అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలస వెళ్తున్నారు. అలా వెళ్లినవారు పూర్తి సమాచారాన్ని సమగ్ర సర్వేలో అందించాల్సి ఉంటుంది. తమ కుటుంబ సభ్యులలో ఇతర దేశాలకు వలస వెళితే 48(ఏ)వ ప్రశ్నలో కోడ్ నంబర్ 1, ఇతర రాష్ట్రాలకు వెళితే కోడ్ నంబర్ 2 గా గుర్తించాల్సి ఉంటుంది. అందులో ఏ దేశానికి వెళ్లింది కూడా తెలియజేయాల్సి ఉంటుంది. ఇక 48(బి) ప్రశ్నలో గల్ఫ్ దేశాలకు వలస వెళ్లితే కోడ్ నంబర్ 04 గా గుర్తించాలి.

పూర్తి సమాచారం ఇవ్వాలి



ప్రస్తుతం చేపడుతున్న సర్వేలో వివిధ గల్ఫ్ దేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లినవారు లేదా వివిధ కారణాల రీత్యా తిరిగి వచ్చిన వారు సమగ్ర సర్వేలో ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్ల ప్రశ్నలకు పూర్తి సమాచారం అందివ్వాలి. తద్వారా రానున్న రోజుల్లో గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ప్రయోజనం చేకూరేందుకు అవకాశం ఉంటుంది. దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

– స్వదేశ్ పరికిపండ్ల, గల్ఫ్ కార్మిక సంఘం నాయకుడు, నిర్మల్

అక్రమంగా తరలిస్తున్న పశువులు స్వాధీనం

ఆదిలాబాద్‌రూరల్: మహారాష్ట్రలోని మాండ్వీలో పశువులను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆదిలాబాద్ పట్టణంలోని స్లాటర్‌హౌజ్‌కు తరలిస్తుండగా శుక్రవారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ శివారు ప్రాంతంలో 30 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు ఆదిలాబాద్ రూరల్ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన షేక్ రఫీక్, వికార్ అహ్మద్‌లు మహారాష్ట్రకు చెందిన మాధవ్ సాయంతో వాటిని కొనుగోలు చేశారన్నారు. మహారాష్ట్రకు చెందిన కూలీలు దీపక్, విజయ్‌ల ద్వారా పశువులను కాలినడకన ఆదిలాబాద్‌కు తరలిస్తున్నారని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి పశువులు స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


మాజీ ఎంపీపీపై యువకుల దాడి



గాయాలతో కింద పడిన లక్ష్మణ్

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామంలో శుక్రవారం కౌటాల మాజీ ఎంపీపీ కుమ్మరి లక్ష్మణ్‌పై దాడి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కౌటాల మండలంలోని యాపలగూడ గ్రామానికి చెందిన ప్రశాంత్, సాయి అనే ఇద్దరు యువకులు బాబాసాగర్ గ్రామంలోని ప్రధాన రహదారిపై లక్ష్మణ్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని అడ్డుకుని దాడికి పాల్పడ్డారు. గ్రామస్తులు దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించినా యువకులు విన్పించుకోలేదు. దీంతో గ్రామస్తులు యువకులకు దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని యువకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కుమ్మరి లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలు కాగా అతడిని చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించారు. ఎస్సై ఇస్లావత్ నరేశ్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కేసు నమోదు చేయలేదని తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే యువకులు మాజీ ఎంపీపీపై దాడికి పాల్పడినట్లు సమాచారం.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



సాయిరాం మృతదేహం

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధి చింతలపేట్ గ్రామానికి చెందిన బామన్ల సాయిరాం(24) ఈ నెల 5న దుబాయ్‌లోని తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయిరాం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లి మృతి చెందిన యువకుడి కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. దుబాయ్ నుంచి స్వగ్రామానికి మృతదేహం రావడంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

బాలుడిపై పిచ్చికుక్క దాడి

లక్ష్మణచాంద: పిచ్చికుక్క దాడిలో బాలుడు గాయపడిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన పత్తిపాక రమణ కుమారుడు పత్తిపాక త్రినాథ్ అనే నాలుగేళ్ల బాలుడు శుక్రవారం ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా పిచ్చి కుక్క దాడి చేసింది. దీంతో బాలుడి కాలుకు తీవ్ర గాయమైంది. వెంటనే బాలుడిని జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. గ్రామంలో పి చ్చికుక్కల స్వైర విహారం ఎక్కువైందని తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.